అక్రమ నిర్మాణాలను తొలగించాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలోని ప్రభుత్వ చెరువు గట్టులను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే తొలగించాలని సీపీఐ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న అన్నారు. తారకరామ కాలనీని ఆనుకుని ఉన్న చీపురుబందను ఇప్పటికే ఓ ప్రైవేట్ లే అవుట్‌కు లబ్ది చేకూర్చేందుకు చెరువు కబ్జా చేసి హడావుడిగా సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారని అన్నారు. అలాగే అమ్మిగారి కోనేరు గట్టుపై అక్రమ ఇల్లు కట్టడాలు కొంతమంది చేపడుతు న్నారని, ఇందిరమ్మ కాలనీలో ఇప్పటికీ అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వాటిని అరికట్టడంలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలం చెందిందని ఆరోపించారు. ఇప్పటికే కోటి చెరువు, బైరి సాగరం, చీపురు బంద సగానికి పైగా ఆక్రమణలకు గురయ్యాయని, ప్రభుత్వ ఆస్తులను ప్రభుత్వ చర్యలను కాపాడవలసిన రెవెన్యూ మున్సిపల్ యంత్రాంగం కార్యాలయాల ముందు సీపీఐ అనేక ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా సంబంధిత రెవెన్యూ, మున్సిపల్ అధికారులలో చలనం లేదని ఆరోపించారు. ఇటీవల రెవెన్యూ డివిజనల్ అధికారి శేష శైలజ ప్రభుత్వ చెరువులు ప్రభుత్వ ఆస్తుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టొద్దని అక్రమ నిర్మాణాలపై చర్యలు చేపట్టాలని రెవెన్యూ మున్సిపల్ అధికారులకు ఆదేశించిన ఆదేశాలు అమలు జరగటం లేదని అన్నారు. ఇప్పటికైనా మునిసిపల్, రెవెన్యూ అధికారులు కళ్ళు తెరిచి పట్టణంలో చేపడుతున్న అక్రమ కట్టడాలపైన తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఆధునిక సాంకేతికతతో అద్భుత అకాశాలు

విశాలాంధ్ర - డెంకాడ: ఆధునిక సాంకేతికతపై అభిరుచి కలిగి ఉంటే అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోవచ్చు అని వైజాగ్ స్టీల్ ప్లాంట్ జనరల్ మేనేజర్ ప్.పార్ధ సారధి ఘోష్ అన్నారు. లెండిలో మెకానికల్ విభాగ యువజనోత్సవం (విధాత్రి) 2023లో ఆయన పాల్గొని మాట్లాడారు. సబ్జెక్టుపై స్పష్టమైన దృష్టి, సృజనాత్మకత పెంపొందిచు కోవాలని, లక్ష్యాలు గొప్పగా ఉంటూ ఆధునిక సాంకేతికతపై అభిరుచిని కలిగి అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 3డి ప్రింటింగ్ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డా. వి .వి. రామారెడ్డి మాట్లాడుతూ మెకానికల్ ఇంజనీర్స్ ఎప్పటికప్పుడు సాంకేతికను అంది పుచ్చుకుంటే కెరీర్ అద్భుతంగా ఉంటుందని, మంచి ప్రవర్తన చిత్తశుద్ధితో సాధన చాలా ముఖ్యమని విద్యార్థులకు హితవు పలికారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఎన్.దీప్లా నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు ఏదైనా సాధించాలంటే నేర్చుకోవాలనే తపన, నాయకత్వ లక్షణాలు, భావ వ్యక్తీకరణ చాలా ముఖ్యమని తెలిపారు. విభాగాధిపతి డా. సతీష్ పూజారి మాట్లాడుతూ రోబోటిక్స్, ప్రోడక్ట్ డిజైన్, ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్, 3డి ప్రింటింగ్, ఆటోమొబైల్ ముఖ్యంగా ఎలక్ట్రికల్ వెహికల్స్ రంగంలో ప్రస్తుతం మంచి కొలువులు స్వాగతం పలుకుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా హరిబాబు తమ్మినేని, ఎవి పరాంకుశం, ప్లేస్ మెంట్ డీన్ జి ప్రకాష్ బాబు అన్ని విభాగాల అధిపతులు, డా రాజన్ బాబు, డా రామారావు, డా రాజేంద్ర, డా సుబ్బరామయ్య, డా దుర్గా శైలజ, సతీష్, పలువురు డిపార్ట్మెంట్ మరియు ఇతర కళాశాలలైనా, ఎంవిజిఆర్‌జే ఎన్టీయూ జివి విద్యార్థినీ, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొనగా అధ్యాపకులు కే.సి. హెచ్.శేఖర్, డా. కే, శ్రీధర్, డా. తిమోతి, సుబ్రహ్మణ్యం, దానియల్, వివిధ అధ్యాపకబృందం పాల్గొన్నారు.

నేటి నుండి పదవ తరగతి పరీక్షలు: డీఈఓ లింగేశ్వర రెడ్డి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుండి ప్రారంభం కానున్నాయని, ఈ పరీక్షలకు సుమారు 25,527 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని డీఈఓ లింగేశ్వర రెడ్డి తెలిపారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల 45 నిమిషాల వరకు పరీక్షలు జరుగుతాయని, సంబం ధిత పరీక్షా కేంద్రాలకు అరగంట ముందుగా చేరుకునేలా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 127 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 432 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి 25,527 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 24,099 మంది కాగా అందులో బాలురు 12,272, బాలికలు 11,828 మంది ప్రైవేట్ విద్యార్థులు 1428 మంది ఉన్నారన్నారు. అదేవిధంగా పరీక్షలకు నిర్వహణకు సంబంధించి ఏ కేటగిరి సెంటర్లు 58, బి కేటగిరి సెంటర్లు 34, సి కేటగిరి సెంటర్లు 35 ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా 7 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 35 సిట్టింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని మొత్తం 1311 మంది ఇన్విజిలేటర్లను నియమించడం జరిగిందని తెలిపారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేశామని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. చీఫ్ సూపరిడెంట్ డిపార్ట్మెంటల్ ఆఫీసర్‌తో సహా ఎవరో మొబైల్ ఫోన్ లను పరీక్ష కేంద్రాలకు తీసుకురాకూడదని తెలియజేశారు.

సీఎంకి యువత బుద్ధి చెప్పాలి

టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గత నాలుగేళ్ల వైసీపీ పాలనలో నిరుద్యోగ యువత ప్రభుత్వం నుంచి సహకారం లేక భవిత ప్రశ్నార్థకంగా మారిందని, ఉపాధి ఉద్యోగాలు లేక రాష్ట్రంలో గత మూడేళ్ల నుంచి అనేకమంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారని టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి బేబీనాయన అన్నారు. గత టీడీపీ హయాంలో రెండుసార్లు డీఎస్సీ నిర్వహించి 18 వేల వరకు ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందని, కానీ ప్రతి ఏటా మెగా డీఎస్సీ అన్న జగన్ రెడ్డి ఒక్క టీచర్ ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. అధికారంలోకి రాగానే 2.30 లక్షల నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీ, ప్రతీ ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ అంటూ ప్రగల్భాలు పలికిన జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేశారని ఆరోపించారు.

రూ.54 లక్షలతో అభివృద్ధి పనులకు కోలగట్ల శంకుస్థాపన

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: నగరంలో శంకుస్థాపన వారోత్స వాలలో భాగంగా ఆదివారం 49, 50 డివిజన్లో 54 లక్షల రూపాయలతో చేపట్టనున్న పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. 49వ డివిజన్లో 8 లక్షల రూపాయలతో రహదారులు, 50వ డివిజన్లో పైపులైను పనులకు, మరుగుదొడ్లకు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు సంపూర్ణ మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. చేపట్టబోయే పనులకు శంకుస్థాపనలు, పూర్తయిన పనులకు ప్రారంభోత్సవ వారోత్సవాలు నిర్వహించేందుకు నిర్ణయించడమైనది అన్నారు. ఇందులో భాగంగా శంకుస్థాపన వారోత్సవాలలో నాలుగవ రోజున 54 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. జోనల్ ఇంచార్జ్ కంటుభుక్త తవిటి రాజు మాట్లాడుతూ నగరంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు సాగుతున్న అన్నారు. వార్డు పర్యటనలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను పరిష్కరించేందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేవతి దేవి, 50వ డివిజన్ కార్పొరేటర్ పట్టా ఆదిలక్ష్మి, 49వ డివిజన్ వైసిపి ఇన్చార్జి కనుగుల రాజా, సీనియర్ నాయకులు రొంగళి పోతున్న తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎంసెట్‌లో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర - భోగాపురం: యువ భరోసా కార్యక్రమంలో భాగంగా నెల్లిమర్ల నియోజక వర్గ యువతను ప్రోత్సహిస్తూ ఇంటర్మీ డియట్ పూర్తయిన పేద విద్యార్థిని, విద్యా ర్థులకు అండగా జనసేన పార్టీ తరపున నియోజకవర్గ నాయ కురాలు లోకం మాధవి ఆధ్వర్యంలో ఎంసెట్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఇంజనీరింగ్ ప్రవేస రుసుము, శిక్షణా చేపడుతున్నారు. అందులో భాగంగా ఆదివారం నెల్లిమర్ల నియోజకవర్గంలోని 4 మండలాల్లో ఎంసెట్ రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ ప్రారంభించారు. ప్రతి మండలంలో ఒక స్టాల్‌ని పెట్టి ఆ మండలంకి చెందిన విద్యార్థిని, విద్యార్థులకు ఎంసెట్ రిజిస్ట్రేషన్‌తో పాటు ప్రవేశ రుసుము చెల్లించారు. ఈ కార్యక్రమానికి నెల్లిమర్ల నియోజక వర్గం నలుమూలల నుండి అశేష స్పందన లభించింది. లోకం మాధవి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతో మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చేసి ఆపేస్తున్నారని, దీనికి ముఖ్య కారణం వారికి అవగాహన కల్పించేవారు లేకపోవడమే అని అన్నారు. ఇంజనీరింగ్ చేయాలి అని నిశ్చయించుకున్న వారికి దిశా నిర్దేశం చేసే వారు లేరని పలువురు తల్లిదండ్రులు తన దగ్గర వాపోయారని మాధవి తెలిపారు. దీనిని గమనించి ఎంతోమంది విద్యార్థులను ఇంజనీరింగ్ వైపు నడిపిద్దాం అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం తాము మొదలుపెట్టినట్టు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీల్లో విజయనగరం క్రీడాకారుల హవా

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: ఈనెల 28 నుండి 31వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రంలో కోట యూనివర్సిటీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ క్యాడిట్ పోటీల్లో విజయనగరం చెందిన ముగ్గురు క్రీడాకారులు సిహెచ్ హర్షవర్ధన, బి యశస్విని, ఎం షణ్ముఖ సిద్దార్థ వివిధ విభాగాల్లో మూడు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో మూడు పతకాలు రావడం అనేది ఇదే మొదటిసారి అని జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సిహెచ్ వేణుగోపాలరావు తెలిపారు. న్యూ ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలకు వెళ్లిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. వీరి విజయం పట్ల జిల్లా ఒలింపిక్ అసోసియేషన్, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు అభినందించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే గడప-గడపకు..

ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య

విశాలాంధ్ర - గంట్యాడ: ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా అందించిన లబ్ధిని వివరించడంతోపాటు ప్రజాసమస్యలు తెలుసుకొనందుకే గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పల నరసయ్య అన్నారు. నందాం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేరిన లబ్ధిని వివరించారు. అర్హులం దరికీ సంక్షేమ పథకాలు చేరవేసిన ఘనత వైయస్సార్ ప్రభుత్వంకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పి.హైమావతి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పి.జైహింద్ కుమార్, తహశీల్దార్ ప్రసన్న రాఘవ, ఈవోపీఆర్డి బానోజీరావు, గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ రాజు తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌ను బొబ్బిలి డీఎస్పీ తనిఖీ

విశాలాంధ్ర - తెర్లాం/బాడంగి: బాడంగి మండలంలోని పోలీస్ స్టేషన్‌ను బొబ్బిలి సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహనరావు తనిఖీ చేశారు. ముఖ్యమైన కేసుల దర్యాప్తులో తగు సూచనలు చేశారు. అదేవిధంగా శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జయంతి, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మా నమ్మకం నువ్వే...

మా భవిష్యత్ నువ్వే జగన్ అన్నా

విశాలాంధ్ర - చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో వైశ్య వర్తక సంఘం భవన్‌లో మా నమ్మకం నువ్వే...మా భవిష్యత్ నువ్వే జగన్ అన్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనే విజయనగరం జిల్లా వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ హాజరయ్యారు. సచివాలయ కన్వీనరు, గృహసారధులు, వాలంటీర్లు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పథకాన్ని ప్రజలకు చేరువ చేసే విధంగా సచివాలయ సిబ్బంది కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనువాస్ నాయుడు, ఇప్పిలి అనంతం, కనకమహాలక్ష్మి ఇప్పిలి గోవిందరావు, చీపురుపల్లి పంచాయతీ ప్రెసిడెంట్ ప్రతినిధి మంగళగిరి శ్రీనువాస్‌రావు, కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు, ఎంపీటీసీలు కోసిరెడ్డి రమణ, ముల్లు పైడిరాజు, సతివాడలి అప్పారావు, వార్డు మెంబర్లు గంట్యాడ విష్ణు, మజ్జి శంకర్, పార్టీ నాయకులు బలగలి రమేష్, మల్లంపూడి శ్రీను, పీతల మురళి తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం మన్యం

బోయ వాల్మీకిలను, బెంతు ఒరియాలను ఎస్టీలో కలపొద్దు

విశాలాంధ్ర - బెలగాం: బోయ, వాల్మీకిలను, బెంతు ఒరియాలను గిరిజన తెగల జాబితాలోకి చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానం తక్షణమే ఉపసంహరిం చుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్ చేశారు. పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలో గిరిజన సంక్షేమ సంఘం కార్యదర్శి పి.రంజిత్ కుమార్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను గిరిజన తెగల జాబితాలో చేర్చాలన్న తీర్మానం చాలా దుర్మార్గపు చర్యని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాంప్రదాయ గిరిజన ప్రజలకు ఇది తీవ్రమైన అన్యాయం చేస్తుందని అభిప్రాయ పడ్డారు. గిరిజన ప్రజల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై చర్చించేందుకు గాను ఈనెల 8వ తేదీన పార్వతీపురంలో జిల్లా సదస్సు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొత్స నర్సింగరావు, రైతు కూలీ సంఘం ఆంధ్రప్రదేశ్ నాయకులు ఎస్. విశ్వేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, పిడిఎస్ఓ నాయకులు సోమేశ్, గిరిజన ఐక్య వేదిక నాయకులు బిడ్డిక తమ్మయ్య, ప్రగతి శీల మహిళా సంఘం నాయకులు దుర్గా, ఇతర నాయకుల జన్ని ముత్యాలు, గణేష్, తిరుపతిరావు, భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

వసుదైక భావనే ప్రపంచానికి దిక్సూచి



విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: వైవిధ్యం, విస్తారమైన దేశంలో భారతీయ సనాతన వ్యవస్థ ఎంతో స్ఫూర్తివంతమైనదని స్వామి వివేకానంద కేంద్ర తెలుగు రాష్ట్రాల ప్రాంత సంఘటక్ సుజాత నాయక్ అన్నారు. అంతా ఒక్కటనే వసుదైక కుటుంబ భావనే ప్రపంచానికి దిక్సూచి కాగలదని అభిప్రాయం వ్యక్తం చేశారు. పార్వతీపురంలోని జట్టు ఆశ్రమంలో వివేకానంద కేంద్ర (కన్యాకుమారి) ఆధ్వర్యంలో జీ-20 సదస్సులో భాగంగా సివిల్ సొసైటీ-20 చర్చా వేదికను ఆదివారం నిర్వహించారు. నిర్వాహకులు జట్టు పద్మజమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మన శరీరంలో ఏ రెండు అవయవాలు మరొకదానితో సమానంగా ఉండవని, అయితే ప్రతిదీ తనదైన పనిలో కీలకమైనదే అని గుర్తు చేశారు. అనంతరం సంస్కృతి, విద్య, వ్యవసాయ రంగాల ద్వారా దీనిని చేరుకోగల మార్గాలపై చర్చించి, పలు ప్రతిపాదనలను జీ-20 సమన్వయకర్తలకు పంపించనున్నట్లు వివరించారు. సదస్సులో మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర చైర్మన్ వీఎస్ఎస్ కుమార్, ఆడిటర్ దుర్గా బాలాజీ, వివేకానంద కేంద్ర ప్రాంత సంఘటక్ లక్ష్మీనారాయణ, ఆంధ్ర సంఘటక్ రవికుమార్, పారినాయుడు మాస్టారు, హిందూ ధర్మరక్షా సమితి నందివాడ వేణుగోపాల్, డాక్టర్ చైతన్య, ఆర్టిక్ ప్రకాష్, స్థపతి నర్సింహాచార్యులు, ఏపీజీవీబీ రైటైర్డ్ మేనేజర్ ఎన్. నగేష్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చేపల మార్కెట్ సమస్యలను పరిష్కరించండి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణంలోని మున్సిపల్ చేపలు, మాంసం మార్కెట్ సమస్యలు పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు కోరారు. ఆదివారం సాయంత్రం ఆ పార్టీ నాయకులు గొర్లి చంటి, వంగల దాలినాయుడు, బాలు, సతీష్, హేమంత్, లంక సతీష్, శివ తదితరులు పార్వతీపురం మున్సిపల్ చేపలు, మాంసపు మార్కెట్‌ను పరిశీలించి అక్కడ వ్యాపారులతో మార్కెట్ సమస్యలపై చర్చించారు. మార్కెట్లో దాదాపు 60 కుటుంబాలు జీవిస్తున్నాయని, మార్కెట్‌కు రాకపోకలు సాగించేందుకు రహదారి సదుపాయం లేదని, రేకు షెడ్‌లు లేవని, ఉన్న రేకులు శిథిలావస్థకు చేరి రేకులు ఎగిరిపోయాయని, నీటి సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా ఇంతవరకు రోజువారి ఆశీలు 15 రూపాయలు ఉండగా, ఇప్పుడు 25 రూపాయలకు పెంచారన్నారు. రూ.10లు ఒకసారిగా పెంచడం తమకు ఇబ్బందిగా ఉందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి మున్సిపల్ మార్కెట్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

నేటి నుండి పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - కొమరాడ: సోమవారం నుండి పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని మండల విద్యాశాఖ అధికారి జె.నారాయణ స్వామి తెలిపారు. మండలంలో మొత్తం పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మూడు కేంద్రాలుగా ఏర్పాటు చేశామని తెలిపారు. జెడ్పీ హెచ్, బాలయోగి గురుకుల పాఠశాల, డ్రైవర్ కొమరాడ పాఠశాలలో పరీక్షలు జరుగుతాయన్నారు. హాల్ టికెట్ ఉన్న ప్రతి విద్యార్థి ఉచితంగా బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.

నీతి అయోగ్ సదస్సుకు కలెక్టర్ నిశాంత్ కుమార్

విశాలాంధ్ర - పార్వతీపురం: విశాఖపట్టణంలో జరిగిన నీతి ఆయోగ్ సదస్సులో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ హాజరయ్యారు. నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సి.ఇ.ఓ) బి.వి.ఆర్.సుబ్రహ్మణ్యంను విశాఖపట్నంలో నోవాటెల్ హెూటల్ లో జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. దీనిలో పాల్గొన్న మన్యం జిల్లా కలెక్టర్ పలు అంశాలను ప్రస్తావించారు. జిల్లాలో చేపడు తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. 397 గ్రామాలకు అన్ని వాతావరణంలకు తట్టుకునే రహదారులు అవసరంఉందని, 12 గ్రామాలకు విద్యుత్ కల్పించాల్సి ఉందని చెప్పారు. జిల్లాలో 3.01 లక్షల వంట విస్తీర్ణం ఉందని, అందులో 1.88 లక్షలకు జలవనరుల సదుపాయం ఉందని వివరించారు. పాచిపెంట మండలంలో ఇండస్ట్రియల్ పార్కుకు స్థలాన్ని గుర్తించామని చెప్పారు. విశాఖపట్నం - రాయపుర్ జాతీయ రహదారి, అరకు,పాడేరు, చింతపల్లి మీదుగా వెళుతున్న జాతీయ రహదారులను, జాతీయ రహదారి 26ను అనుసంధానం చేసి తూర్పు కనుమల కారిడార్ (ఈస్టర్న్ ఘాట్ కారిడార్)గా నామకరణం చేయాలని, తద్వారా పర్యాటక రంగం పెద్ద ఎత్తున అభివృద్ధి జరిగి భారీ ఎకనమికల్ కారిడార్ గా అభివృద్ధి చెందగలదని, దీనిని పరిశీలించాలని కోరారు. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువ ఐఎఫ్ఎస్ అధికారులు క్షేత్రస్థాయి పర్యటన

విశాలాంధ్ర - పార్వతీపురం/కురుపాం: 2022 ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐ.ఎఫ్.ఎస్) బ్యాచ్‌కు చెందిన అధికారులు పూసపాటి సాహిత్య (విశాఖపట్నం), దుబ్బాడ ఎస్.వి.అశోక్ (కాకినాడ) ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐ.ఎఫ్.ఎస్) చెందిన అభ్యర్థులు క్షేత్ర స్థాయి శిక్షణా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో పర్యటించారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గోరంట స్వయం సహాయక సంఘాలు నిర్వహిస్తున్న కార్యకలాపాలను పరిశీలించారు. ఇరిడి గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. కురుపాంలో గ్రామ సచివాలయంను పరిశీలించి పనితీరును అడిగి తెలుసుకున్నారు. కురుపాం ఏకలవ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలను సందర్శించారు. వారితో పాటు టి.పి.ఎం.యు ఏపీడీ వై.సత్యం నాయుడు, ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన రాష్ట్ర పరిశీలకులు

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలోని జోగమ్మపేటలో గల కస్తూరిభా గాంధీ బాలిక విద్యాలయంను జాయింట్ సెక్రటరీ, సమగ్రశిక్ష, ఎగ్జామినేషన్స్ రాష్ట్ర పరిశీలకులు ఎన్.గీత ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల మానసిక స్థితికి అనుకూలంగా బోధన చేపట్టాలని వివరించారు. పదవ తరగతి పిల్లలతో మాట్లాడుతూ శ్రద్ధగా చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయనగరం జీసీడీఓ మాలతీ, పార్వతీపురం మన్యం జీసీడీఓ రోజారమణి, మండల విద్యాశాఖ అధికారి సూరి దేముడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ గొట్టాపు హరిత, అధ్యాపకులు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర

విశాలాంధ్ర - సాలూరు టౌన్: కేంద్ర విద్యాశాఖ మంత్రి ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు గ్రామాలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్న దొర డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు కొటియా గ్రామాల్లో మొన్న కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పర్యటించారని ఆయన చేసిన వ్యాఖ్యలు చాలా అవమానంగా ఉన్నాయన్నారు. ఆంధ్రా ఒడిశాకు సంబంధించిన 21 గ్రామాలు వివాదస్పదంలో ఉన్నాయని, ఈ గ్రామాల్లో ఒరిస్సా వాళ్లు కూడా 1968లో కేసు నంబర్ 10 వేయడం జరిగిందని, 1968 డిసెంబర్ 2లో ఆంధ్ర, ఒరిస్సా సమన్యాయాన్ని పాటించాలని సుప్రీంకోర్టు తీర్పును వెల్లడించింది అని తెలిపారు. అదేవిధంగా 30 మార్చి 2006 ఒరిస్సాకు ఎటువంటి హక్కు లేదని కోర్టు తీర్పు ఇచ్చిందని వెల్లడించారు. అయినా ఈ భారతదేశానికి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆయన వినయాన్ని వివేకాన్ని కోల్పోకూడదన్నారు. ఈ భారతదేశంలో అన్ని రాష్ట్రాలను కేంద్రమంత్రి సమానంగా చూడాలని ఒరిస్సా మాది ఆంధ్ర గో బ్యాక్ అనడం సమన్యాయం తగదని హితవు పలికారు. కేంద్ర మంత్రి ఒక రాష్ట్రానికే పరిమితం అవుతారా.? చట్టము రాజ్యాంగం తెలిసినవారు కేంద్ర మంత్రి అవుతారని అటువంటివారు సుప్రీంకోర్టుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రాలు అన్నిటిని సమానంగా చూడాలని ఆంధ్ర ఒరిస్సా ఎప్పుడు కలిసే ఉంటాయని ఆయన చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలని హెచ్చరించారు.

తేనెటీగల దాడిలో పలువురికి గాయాలు

విశాలాంధ్ర - కురుపాం: కురుపాం మేజర్ పంచాయతీ శివన్నపేటకు వెళ్లే రహదారిలో మర్రిచెట్టు దగ్గర కందిరీగల దాడిలో పదిమందికి గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం కందిరీగల పట్లు కదిలి జోగి రాజుపేట గ్రామానికి చెందిన జి.సింహాచలం ద్విచక్ర వాహనంతో శివన్నపేట వెళ్తుండగా ఒక్కసారి కందిరీగలు పట్టు పడి దాడి చేయడం వల్ల అతను తీవ్రంగా గాయ పడ్డాడు. అలాగే శివన్నపేట గ్రామానికి చెందిన ఈ.వెంకట రమణ కురుపాం నుండి శివన్నపేట తన ఇంటికి వెళ్తుండగా ఆయనపై కూడా దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. వీరిద్దరూ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతుండగా మిగతా ఎనిమిది మందికి చిన్న చిన్న గాయాలు తగలడంతో ప్రాథమిక చికిత్స పొంది వారు ఇంటికి వెళ్లిపోయారు.

కమ్యూనిస్టుల ప్రచారోద్యమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - బెలగాం: ప్రజలపై భారాలు వేసే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేపడుతున్న కమ్యూనిస్టుల ప్రచారాందోళనలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో ఆదివారం జరిగిన సిపిఐ, సిపిఎం ఉమ్మడి ప్రెస్ మీట్‌లో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్, ఎల్ఐసి, బ్యాంక్ ప్రభుత్వరంగ సంస్థలను అంబానీ, ఆదానీ చేతిలోకి బిజెపి ప్రభుత్వం తాకట్టు పెట్టిందని ఇప్పటికైనా దేశాన్ని కాపాడుకోవాలని బిజెపి హటావో దేశ్ కో బచావో నినాదంతో గ్రామ గ్రామాన పాదయాత్రలు, జీపు జాతలు నిర్వహించాలని అన్నారు. గ్రామ గ్రామాన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, జిల్లా కార్యవర్గ సభ్యులు అవినాష్, సన్యాసిరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఈవి నాయుడు పాల్గొన్నారు.

చామలాపల్లిలో పూరిపాక తొలగించాలంటూ దాడి

– పలువురు మహిళలకు గాయాలు, ఎస్.కోట సీహెచ్‌సీలో చికిత్స

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఎస్.కోట మండలం చామాలపల్లి గ్రామంలో ఒక వ్యక్తి పూరిపాకను తొలగించాలంటూ దాడి చేసిన ఘటనలో పలువురు గాయపడ్డారు. గాయపడిన వ్యక్తులు ఎస్.కోట సీహెచ్సీలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి బాధితులు యశోద, రమణ, శ్రీను ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చామలాపల్లిలోని ఒక సెంటున్నర స్థలంలో పాక వేసుకొని 45 ఏళ్లుగా చిన్నపాటి దుకాణం పెట్టుకొని జీవిస్తున్నారు. కాగా ఇది తమ జిరాయితీ స్థలమని చెప్పి గ్రామానికి చెందిన కొందరు వచ్చి తమను తీవ్రంగా కొట్టి పాక, బడ్డీలో మనుషులు వున్నప్పటికీ కర్రలకు తాళ్లుకట్టి ట్రాక్టర్తో కర్కశంగా లాగేసి తమను భయభ్రాంతులకు గురిచేసారని తెలిపారు. వృద్ధులు, మహిళలని చూడకుండా తీవ్రంగా కొట్టి గాయపరిచి తాము నివాసం వుంటున్న పాకను పూర్తిగా పెకిలించారని వేమన యశోధ, రమణ, పార్వతి, తాతబాబు, శ్రీను తదితర బాధితులు వెల్లడించారు. గాయపడిన బాధితులు శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాము నివాసం వుంటున్న పాక వెనుక భాగంలో గ్రామానికి చెందిన జుత్తాడ పెదసూర్యారావుకు కొంత జిరాయితీ భూమి ఉందని, తన భూమిలో మీరున్న స్థలం నాదని చెబుతు కొన్నాళ్లుగా వాగ్వివాదానికి దిగుతూ భయపెడుతున్నాడన్నారు. ఈ విషయంపై రెవెన్యూ వారికి తాము ఫిర్యాదు చేయగా వారు సుమారు ఎనిమిది సార్లు ఈ స్థలాన్ని సర్వేచేసి ఇది ప్రభుత్వ స్థలం అని నిర్ధారించారని చెప్పారు. అయినా సరే సదరు వ్యక్తి వేధింపులు ఆపకుండా మమ్మల్ని చంపయినా ఈ పాకను తీసేస్తానని చెప్పి శనివారం సాయంత్రం ఒక ట్రాక్టర్ తెచ్చి తమ పాకలో వున్న కర్రలకు తాళ్లుకట్టి మనుషులు

వున్నాసరే తీసే ప్రయత్నం చేయడంతో చాలాసేపు అడ్డుకున్నామని, తమను కర్రలతో బాదడంతో ప్రాణభయంతో పరుగులు తీసి ఎస్.కోట పోలీసులకు పిర్యాదు చేసేందుకు వచ్చామని వివరించారు. తమపై దాడికి దిగిన జుత్తాడ పెదసూర్యారావు, బుజ్జి, అచ్చియమ్మ తదితరులపై చర్యలు తీసుకోవాలని పోలీసులు బాధితులు కోరుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు స్పష్టం చేశారు.

మహిళలు ఆర్థిక స్వావలంబనను సాధించాలి

విశాలాంధ్ర – సీతానగరం: వైఎస్సార్సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఎన్నో పథకాలను అమలు చేస్తూ మహిళల అభ్యున్నతికి కృషి చేస్తుందని అరకు పార్లమెంటు సభ్యురాలు గొడ్డేటి మాధవి, పార్వతీపురం ఎమ్మెల్యే అలజింగి జోగారావులు తెలిపారు. ఆదివారం సీతానగరం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మూడో విడత ఆసరా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. మూడో విడత ఆసరా క్రింద మండలంలోని 1141 మహిళా సంఘాలకు చెందిన 13వేల 217మంది మహిళ సభ్యులకు రూ.6కోట్ల 86లక్షల 46వేల 827రూపాయలు జమ చేయడం జరుగుతుందని, ఇది మహిళలకు పెద్దవరమని అరకు ఎంపి గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. వై.ఎస్.ఆర్.ఆసరా పథకం క్రింద మూడవ విడతగా పార్వతీపురం నియోజక వర్గంలో 4428 సంఘాలకు చెందిన మహిళలకు రూ.26.45 కోట్లు జమ కానున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా అరకు ఎంపీ మాధవిని, ఎమ్మెల్యే జోగారావును మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు,మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి బలగ రవనమ్మ శ్రీరాములునాయుడు, జడ్పీటిసి మామిడి బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, మండల నాయకులు పోల ఈశ్వరనారాయణ, తెంటు వెంకట అప్పలనాయుడు, ఎన్.రామకృష్ణ, రత్నాకర్, ఆర్వీ పార్థసారథి, అంబటి కృష్ణం నాయుడు, మర్రాపు దనం, బుడితి,ముకుంద, గాజాపు శ్రీనివాసరావు, కురమాన శ్రీను, ఎస్ తిరుపతిరావు,శ్రీకాంత్, సురేష్,శివ,కిషోర్,దాసరి నాగరత్నం, ఎంపిడిఓ ప్రసాద్,తహశీల్దార్ ఎన్వీ రమణ,ఈఓపిఆర్డీ వర్మ, వెలుగు ఏపిఎం రెడ్డి శ్రీరాములు, మండలమహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొడబ ప్రమీల, సిసిలు కోటేశ్వరరావు, ఆనంద్, మోహనరావు, అప్పారావు, స్థానిక ఎంపీటీసీలు గౌరీకిరణ్, కుసుమసూర్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

విశాలాంధ్ర – వేపాడ: వైయస్సార్ కంటి వెలుగులో భాగంగా ఆదివారం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా విద్యార్థులకు కంటి వెలుగు అద్దాలను పంపిణీ చేశారు. వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గురుకుల పాఠశాల కస్తూర్బా ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన కంటి పరీక్షల్లో భాగంగా 94 మందికి కంటి అద్దాలను సమకూర్చినట్లు వియ్యం పేట ప్రభుత్వ వైద్యశాల ఆప్తాల మిక్కు అసిస్టెంట్ సిహెచ్ ఈశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులలో ఏర్పడ్డ కంటి సమస్యలు పరిష్కారం కొరకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: కొత్తపేటలో సంపత్ వినాయక స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం ఈనెల 6,7,8 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ యడ్ల పైడిరాజు, ఆలయం కమిటీ మెంబర్ డాక్టర్ రామయ్య తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ 6, 7న ప్రతి రోజు ఉదయం హెూమం, ప్రత్యేక అభిషేకంలు నిర్వహించడం జరుగుతుందని, 8న భారీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమరనాద్, ఎమ్మెల్సీ రఘురాజు, ఎమ్మెల్యే బడుకుండ అప్పలనాయుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీను తదితరులు హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మూర్తి, మురళి, శేఖర్, మధు, మహిళా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేటి నుండి పదవ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఈనెల 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న పదోతరగతి పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించనున్నామని మండల విద్యా శాఖాధికారి వి.సత్యనారాయణ తెలిపారు. ఆయన విశాలాంధ్ర ప్రతినిధితో ఆదివారం మాట్లాడుతూ మండలంలో ఉన్న మొత్తం 21 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లకు సంబంధించి 916 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఎస్.కోట పట్టణంలో మొత్తం నాలుగు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, వీటిలో ప్రభుత్వ బాలుర, బాలికల హైస్కూళ్లతో పాటు నారాయణ (కేంబ్రిడ్జ్) స్కూల్, రవీంద్రభారతి స్కూళ్లలో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. తిమిడి, వీరనారాయణం, కొట్టాం. ఏపిఆర్ఎస్(బాలికలు) తాటిపూడి హైస్కూళ్లకు సంబంధించి మొత్తం 171 మంది విద్యార్థులను జామి, వేపాడ, గంట్యాడ మండలాల్లోని పరీక్షా కేంద్రాలకు కేటాయించామని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలను కల్పిస్తున్నామని ఎంఈఓ వివరించారు.

ఆసరా విజయవంతంపై సర్వత్రా హర్షం

విశాలాంధ్ర – సీతానగరం: మూడో విడత ఆసరా కార్యక్రమాన్ని మహిళలు విజయవంతం చేయడం పట్ల నేతలు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలో నిర్దేశించిన లక్ష్యాల కంటే పెద్ద ఎత్తున మహిళలు సమావేశానికి హాజరు కావటం పట్ల మండల వైఎస్సార్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, జెడ్పీటీసీ బాబ్జి పెదభోగిలి ఎంపీటీసీలు సూర్య నారాయణ, కిరణ్ కుమార్, మండల కన్వీనర్ యూ. సురేశ్, ఆర్వీ కిషోర్, శివ, రమేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు మండలానికి విచ్చేసిన అరకు ఎంపి మాధవి, ఎమ్మెల్యే జోగారావులపై వేదిక వద్దకు వచ్చే సమయంలో పెద్దఎత్తున పువ్వులని జల్లుతూ స్వాగతం పలికారు. వారిని గజమాలతో ఘనంగా సత్కరించారు.మరోవైపు ఆసరా కార్యక్రమం విజయవంతంచేయడంలో కీలకమైనపాత్ర పోషించిన వెలుగు సహాయ ప్రోగ్రాం అధికారి రెడ్డి శ్రీరాములు, సీసీలు, గ్రామైఖ్య,మహిళ సంఘాల నేతలు కృషిని కొనియాడారు.కార్యక్రమము విజయవంతం చేయడంలో అందరి కృషి గొప్పదని, అందరి సహకారంతో సక్సెస్ అయిందని ఎంపిడిఓ ప్రసాద్ , వెలుగు ఏపిఎం శ్రీరాములు కృతజ్ఞతలు తెలిపారు.

దేవిబొమ్మ జంక్షన్ వద్ద డివైడర్ పైకి దూసుకెళ్లిన కారు

విశాలాంధ్ర, శృంగవరపుకోట : ఎస్.కోట పట్టణంలోని దేవి జంక్షన్ వద్ద అరకు వైపు నుంచి విశాఖపట్నం వెళ్తున్న స్విఫ్ట్ కారు వేగంగా డివైడర్ పైకి దూసుకెళ్లి నిలిచిపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇదిలావుండగా ఇప్పటికే అనేక సార్లు ఇలా డివైడర్ల పైకి కార్లు, బొలేరా, వ్యాన్లు వంటి వాహనాలు దూసుకుపోయి బోల్తా పడిన సంఘటనలు జరిగాయి. ఇలా జరగడానికి డివైడర్ ఎత్తు తక్కువగా ఉండటం, డివైడర్లు ప్రారంభమైన నాలుగు వైపులా ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయక పోవడమే కారణమని వాహన చోదకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ లో డివైడర్లు కానరాక పోవడం కూడా ఇటువంటి ప్రమాదాలకు కారణమవుతుంది. ఇప్పటికైనా ఆర్ అండ్ బి, పోలీసు తదితర శాఖల అధికారులు ఇటువంటి ప్రమాదాలు జరగకుండా డివైడర్ల వద్ద రెడ్ స్టిక్కర్లతో కూడిన హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వాహన చోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

ఒడియా విద్యార్థులకు టాలెంట్ టెస్ట్..

విశాలాంధ్ర –భామిని: ఓడియా మాధ్యమంలో చదువుతున్న ఐదవ తరగతి విద్యార్థులకు నిర్వహించిన "మేధో సన్మాన్ టాలెంట్ టెస్ట్(2023)" లో భాగంగా భామిని మండలం లోని ఓడియా మధ్యమ విద్యార్థులకు అపోటా భామిని శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి న్.సుఖిల, న్.రాజశేఖర్ వారి ఆధ్వర్యంలో ఎం పి పి స్ బత్తిలిలో నేడు పరీక్ష నిర్వహించారు. దినికై మూడు పాఠశాలలా నుండి 15 మంది విద్యార్థులు హాజరు కాగా, మండల టాపర్ గా కిరణ్ గౌడో(బత్తిలి),రెండోవ స్థానంలో ప్రియాంబోద గౌడో(కాట్రగడ), మూడవ స్థానంలో బాదపు శృతి(బత్తిలి) దక్కించుకోవడం జరిగింది. వీరికి %శాూరాాూరా% భామిని శాఖ తరుపున పీఆర్టీయు భామిని శాఖ తరుపున పీఆర్టీయు రాష్ట్ర కౌన్సిలర్ మీసాల ప్రఫుల్ కుమార్ గారు ప్రశంస పాత్రలు, మెమోంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో న్. ఇందిర, బి.రోహినేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ షాక్‌తో యువకుడు మృతి

విశాలాంధ్ర –భామిని: కరెంట్ షాక్ తో యువకుడు మృతి.ఆదుకుంటాడు అను పెద్ద కుమారుడు మృత్యు వాతతో తల్లడిల్లుతున్న కుటుంబం వివరాలోకి వెళ్తే మండలంలో గల నులకజోడు గ్రామ సచివాలయ కేంద్రంలో గ్రామ పంచాయతీ మోటార్ ట్యాంక్ వద్ద స్నానానికి వెళ్లి యువకుడు మృత్యు గా మిగాలాడు.స్థానిక గూడ వీధికి చెందిన గోరుశెట్టి గణేష్ (20) ఆదివారం ఉదయం ఇంటి పనులు ముగించుకుని మోటార్ వద్ద కు స్నానికి వెళ్లి మోటార్ స్విచ్ ఆన్ చేస్తూ షాక్ గురై సంఘటన స్థలంలో ప్రాణాలు విడిచాడు. తల్లి దండ్రులు గౌరు శెట్టి మోహనరావు,రవనమ్మలకు ఇద్దరు కుమారులతో మృతుడు పెద్ద కుమారుడు డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు . వలస కూలీలుగా పలు ప్రాంతాల్లో కాయకష్టం చేసి కుమారుడికి చదిస్తున్న తల్లిదండ్రులు అనుకోని ప్రమాదం కరెంట్ షాక్ తో కుమారుడు ప్రాణాలు కోల్పోవడంతో ఆ ఇంటా విషాదం నెలకొంది.

ఆసరా ఉత్సవాలను విజయవంతం చేయండి

విశాలాంధ్ర-జామి: రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతో అమలు చేస్తున్న ఆసరా పథకం అమలులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం జామిలో నిర్వహించే ఆసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని మండల వైకాపా కన్వీనర్ గొర్లె రవికుమార్ కోరారు. జామిలోని శ్రీఎల్లారమ్మ ఆలయ ఆవరణలో నిర్వహించే ఈఉత్సవాలకు జెడ్పి చైర్మన్ చిన్న శ్రీనుతోపాటు, స్థానిక ఎమ్మెల్యేలు బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, స్థానిక మండల పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని అన్నారు.

జామి హైస్కూల్‌కు బెహరా విద్యాసంస్థల వితరణ

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలోని జిల్లా పరిషత్ఉన్నత పాఠశాలకు కొట్యాడలోని బెహరా విద్యాసంస్థల యాజమాన్యం సౌండ్ సిస్టంను వితరణగా అందజేసింది. రూ. 25వేల విలువైన ఈసౌండ్ సిస్టంలో మైకుతోపాటు సౌండ్ బాక్స్ ఉంటుంది. ఈమేరకు ఆదివారం బెభకరా విద్యాసంస్థల ఎండి బెహరా విజయ చేతుల మీదుగా జామి హైస్కూల్ స్టాఫ్ సెక్రటరీ గుండాలశ్రీనివాసరావు, విడి చంద్రశేఖర్‌లకు అందజేసారు. బెహరా విద్యాసంస్థల యాజమాన్యానికి పాఠశాల హెచ్ఎం అబ్దుల్ రహమాన్, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

యోగాతో ఆరోగ్యం

విశాలాంధ్ర – శృంగవరపుకోట: ఉన్నతమైన జీవితం గడిపేందుకు మెడిటేషన్ దోహదపడుతుందని బ్రహ్మకుమారి శైలజ స్పష్టం చేశారు. ఎస్.కోట మండలం గౌరిపురం గ్రామంలో ఎస్.కోట బ్రహ్మకుమారిస్ ఆశ్రమం ఇన్ ఇన్చార్జి సోదరి బి కే శైలజ ఆధ్వర్యంలో శివ పరమాత్మ జెండా వందన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శృంగవరపుకోట ఎంపీపీ సండి సోమేశ్వరరావు, కిల్తంపాలెం సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, గౌరీ విద్యా నికేతన్ ప్రిన్సిపల్ శ్రీను మాస్టారు, (కాంగ్రేగుల వెంకటరాము), డీలర్ సుంకరి బుల్లి, కిల్తంపాలెం మాజీ ఎంపీటీసీ బీసెట్టి అరుణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బొద్దాం, శివరామరాజుపేట, ఎస్.కోట, పెదకండేపల్లి, గవరపాలెం, రాజుల కల్లాలు, రాజీపేట, గౌరీపురం తదితర గ్రామాల నుంచి వచ్చిన బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

ఎంసెట్ ప్రి మెగా గ్రాండ్ టెస్ట్ విజేతలకు బహుమతులు

విశాలాంధ్ర – చీపురుపల్లి: ఎంసెట్ ప్రి మెగా గ్రాండ్ టెస్ట్ విజేతలకు విజయనగరం జిల్లా వైసీపీ యువజన నాయకులు బెల్లాన వంశీకృష్ణ బహుమతులను ప్రధానం చేశారు. ఏఆర్కే స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టెస్ట్‌లో విజేతలకు బహుమతి ప్రదానం ఆదివారం జరిగింది. విద్యార్థులు ఎంసెట్‌లో మంచి ర్యాంక్‌లు సాధించి, ఇనిస్టిట్యూట్‌కు మంచి పేరును తీసుకురావాలని కోరారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర – సీతానగరం: మండల కేంద్రంలోని హనుమాన్ కూడలి వద్ద ఎస్ఐ నీలకంఠం అధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. వాహనాల యజమానులు తప్పని సరిగా అన్ని రకాల ధృవీకరణ పత్రాలతో వాహనాలు నడపాలని తెలిపారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా సోమవారం నుండి సీతానగరం, జోగమ్మపేట, బూర్జ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉత్తర్వులు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర – విజయనగరం టౌన్: అయ్యన్నపేట జంక్షన్ కోయినగర్ ప్రాంతంలో ఉన్న బస్సు షెల్టర్ లో ప్రతి సంవత్సరం వలె మదర్ తెరిసా సేవా సంఘం బ్లడ్ డోనర్స్ క్లబ్, మదర్ తెరిసా కిడ్స్ స్కూల్ సంయుక్తంగా వేసవికాలం సందర్భంగా "చలివేంద్రాన్ని" 55వ డివిజన్ కార్పొరేటర్ సంతోషి, పండు దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మజ్జిగ ప్యాకెట్లు పాదచారులకు, శ్రామికులకు అందజేశారు. ఈ కార్యక్రమం మదర్ తెరిసా సేవా సంఘం అధ్యక్షులు త్యాడ ప్రసాద్ పట్నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు త్యాడ వేణుగోపాలం, సభ్యులు తనీష్, అయ్యన్నపేట పరిసర ప్రాంత పెద్దలు జామి సూరిబాబు, సింబోతుల ప్రసాద్, మహంతి ప్రసాద్, బెల్లాన అప్పారావు, చైతన్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో మహిళలకు ఆర్థిక భరోసా

విశాలాంధ్ర – దత్తిరాజేరు: మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆదివారం 975 స్వయం సహాయక డ్వాక్రా సంఘాల్లో 11,379 మంది మహిళలకు గజపతినగరం శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య చేతుల మీదుగా 5,56,13,203 రూపాయలు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో మహిళలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని అన్నారు. ఈ మొత్తాన్ని ఎకౌంటులకు జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమల ముత్యాల నాయుడు, జడ్పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తి రెడ్డి రమేష్, బీసీ సెల్ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కడు బండి రమేష్ నాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు సుమల శ్రీనివాసరావు, బిఎస్ఎన్ఎల్ టెలికాం డైరెక్టర్ దత్తి చిరంజీవి, సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణ గుర్తింపు సరే...తొలగింపు చర్యలేవి!

విశాలాంధ్ర – వేపాడ: ప్రభుత్వ భూముల్లో అక్రమ రాతి క్రషర్ నిర్మాణం అనే శీర్షికన విశాలాంధ్ర దినపత్రికలో వెలువడిన కథనానికి మండల తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు స్పందించి గత నెల 27న తన సిబ్బందితో ఆక్రమణకు గురైన ప్రదేశంను సచివాలయం సర్వేయర్లుతో సర్వే చేశారు. వావిలపాడు రెవెన్యూలో సర్వే నంబరు 93-1లో సుమారు 0.50 సెంట్లు ప్రభుత్వ భూమిని, సర్వే నెంబరు 94లో సుమారు 0.59 సెంట్లు ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అయితే ఆ భూమిలో ఎన్‌కేసీ సంస్థ రాతి క్రషర్‌కు సంబంధించి కంటైనర్లు క్వారీ మెటీరియల్‌లు ప్రభుత్వ భూమి ఆక్రమించి వేయడం అందులో మెటీరియల్ ఉన్నట్లు గుర్తించి తక్షణమే వాటిని తొలగించి ప్రభుత్వ భూమిని ఖాళీ చేయించాలని గ్రామ రెవెన్యూ అధికారి రామానుజంనకు తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు ఆదేశించినప్పటికీ ఎన్‌కేసీ సంస్థ క్రషర్ యజమానులు ఆ ప్రభుత్వ స్థలమును నేటికీ ఖాళీ చేయకపోగా అదే భూములో క్రషర్ పనులు చేపడుతున్నారు. ఈ విషయమై గ్రామ రెవెన్యూ అధికారి రామానుజన్‌ను వివరణ కోరగా ఎన్.కే.సి రాతి క్రషర్ యజమానులకు చెప్పడం జరిగిందని సోమవారం నాటికి ఖాళీ చేయిస్తామని క్రషర్ యజమానులు చెప్పారని గ్రామ రెవిన్యూ అధికారి చెప్పారు.

జామి శ్రీఎల్లారమ్మ ఆలయంలో హుండీ చోరీ

విశాలాంధ్ర-జామి: శ్రీ ఎల్లారమ్మ ఆలయంలో శనివారం రాత్రి హుండీ చోరీకి గురయింది. ఉదయం ఆలయ పూజారి వెళ్ళగా తాళాలు పగలగొట్టి ఉండడంతోపాటు లోపల హుండీపైకప్పు కనిపించకపోవడంతో వెంటనే స్థానిక ఉపసర్పంచ్ అల్లు పద్మ వద్దకు వచ్చి విషయాన్ని తెలియజేసారు. ఆమె వెంటనే దేవాదాయశాఖ అధికారులకు, జామి పోలీసులకు, మీడియాకు సమాచారమందించారు. ఆలయానికి సిసి కెమెరాలు ఉన్నా ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. అలాగే రాత్రి ఆలయం వద్ద కాపాలాకు దేవాదాయశాఖ ప్రత్యేక వేతనంతో వాచ్‌మేన్‌ను ఏర్పాటు చేసారు. కానీ సంఘటన జరిగిన రోజు రాత్రి వాచ్‌మేన్ అక్కడ కాపాలా లేదని తెలుస్తోంది. మూడు తలుపులకు గాను ఒక తాళం కప్ప పగలగొట్టి ఉంది. మిగిలిన రెండు తలుపులకు తాళాలు కనిపించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. దేవాదాయశాఖ ఇవో ఎం.ప్రసాదరావు పోలీసులకు ఫిర్యాదు చేసారు. చోరీకి గురైన హుండీలో దాదాపు రూ.70వేల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. సంఘటనా సమాచారం అందుకున్న వెంటనే జామి పోలీసులు, విజయనగరం నుంచి సిసిఎస్ పోలీసులు వచ్చి దర్యాప్తు చేసారు.

మూడు కేంద్రాల్లో పది పరీక్షలు

విశాలాంధ్ర – సీతానగరం: మండలంలోని మూడు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి జి.సూరి దేముడు తెలిపారు. సోమవారం నుండి ఈనెల 8వరకు జరుగుతాయని తెలిపారు. బూర్జ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 181 మంది విద్యార్థులు ,సీతానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 190 మంది విద్యార్థులు, జోగమ్మపేట ప్రతిభా కళాశాల పరీక్ష కేంద్రంలో 187 మందివిద్యార్థులు పరీక్షలను రాస్తారని చెప్పారు. మండలంలోని మొత్తం 558 మంది పరీక్ష లకు హాజరు కానున్నారని చెప్పారు. తహశీల్దార్ ఎన్వీ రమణ 144సెక్షన్ ఉత్తర్వులు జారీచేశారని, ఎస్ ఐ నీలకంఠం అధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

పది పరీక్షల కేంద్రాల వద్ద 144 సెక్షన్

విశాలాంధ్ర-రేగిడి : రేగిడి మండలంలోని సంకిలి, రేగిడి, లక్ష్మిపురం, అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం నుంచి నిర్వహించనున్న 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఎస్సై ఈ శ్రీనివాసరావు తెలిపారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల లోపు ఎటువంటి జిరాక్స్ షాపులు, నెట్ సెంటర్లు ఉండరాదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర – గంట్యాడ: గంచాడ మండలం మోకాలపాడు జంక్షన్ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజాన దాలినాయుడు 34 మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం మృతుడు బోనంగి పనిమీద వెళ్లి తిరిగి తన స్వగ్రామమైన కొత్త వెలగాడ గ్రామానికి వెళుతున్న క్రమంలో మార్గమధ్యంలో అదుపుతప్పి రోడ్డు ప్రక్కన ఉన్న బోర్డును ఢీకొనడంతో తలకు బలమైన గాయమైఅక్కడికక్కడే మృతి చెందాడు. గంట్యాడ ఎస్సై కిరణ్ కుమార్ నాయుడు కేసు నమోదు చేసి పంచనామా అనంతరం పోస్ట్ మొత్తం నిమిత్తం విజయనగరం కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

ఖాదర్ బాబా దర్బార్‌లో రంజాన్ మాస దశమ ఇఫ్తార్

విశాలాంధ్ర-విజయనగరంటౌన్: పవిత్ర రంజాన్ మాస దశమ ఉపవాస దినాన్ని పురస్కరించుకుని హజరత్ ఖాదర్ బాబా ఔలియా దర్గా దర్బార్ షరీఫ్ లో ఆదివారం సాయంత్రం ' దశమ ఇఫ్తియార్ లంగర్ ' ఘనంగా జరిగింది. దర్గా దర్బార్ షరీఫ్ ధర్మకర్త డా.ఎం.డీ. ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ(ఖలీల్ బాబు) ప్రేమ పూర్వక ఇఫ్తార్ దావత్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా రంజాన్ ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందుతో పాటు పరిసర ప్రాంత ప్రజలకు ఖాదర్ బాబా అన్న ప్రసాదాన్ని అందించారు.

పేకాడుతున్న వ్యక్తులు అరెస్టు



విశాలాంధ్ర – విజయనగరం క్రైమ్: పట్టణంలోఎన్.ఆర్.ఐ. ఆసుపత్రి వెనుక పేకాడుతున్న పదిమంది వ్యక్తులను ఈనెల 1వ తేదీన ఒకటవ పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు వన్టౌన్ ఎస్సైలు వి.అశోక్ కుమార్, శ్రీరామ గణేష్‌లు దాడి చేసి, పేకాట ఆడుతున్న 10మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 53,484 రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర – వేపాడ: మండల కేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైయస్సార్ 3వ విడత కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఏ.ధరణి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం చేశారు. ఇందులో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్టు వైద్యాధికారిణి ధరణి తెలిపారు. ఈ వైద్య శిబిరంలో వేపాడ, బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

విశాలాంధ్ర – తెర్లాం: తెర్లాం శాఖ గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులచే తెనాలి రామకృష్ణ కథలు, బాలమిత్రకథలు, నీతి కథలు చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి సీహెచ్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం

విశాలాంధ్ర – తెర్లాం: మండలంలో ఉద్దవోలు గ్రామంలో ఆదివారం మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్, విశ్వాసులు గ్రామం అంతట తిరిగి క్రీస్తు పడిన శ్రమను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మండలంలో అన్ని గ్రామాల్లో 42 రోజులు ఉపవాస ప్రార్థనలతో క్రీస్తుని స్తుతిస్తున్నాం అని విశ్వాసులు తెలిపారు.

కురుపాం : స్థానిక గుడ్ సమారిటన్ లూథరన్ దేవాలయం పాస్టర్ రెవరెండ్ పి.జీవన్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా మట్టల ఆదివారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు పిల్లలు పెద్దలతో కలిసి అలంకరించిన ఈత రెమ్మలు పట్టుకుని కురుపాంలో గల ప్రధాన రహదారి, శివన్నపేట, వైరిచర్ల కాలనీ వరకు ఏసుక్రీస్తు పాటలు పాడుచు మట్టల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు డి.జాన్, డి.రాజారత్నం, డి.ప్రదీ ప్, కె.సుదర్శన్, కె.ఈశ్వరరావు, డి.మజ్జి బాబు పాల్గొన్నారు.

సమావేశమైన ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ సేవల సంఘం

విశాలాంధ్ర - బెలగాం : ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ సేవల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా కార్యవర్గ సమావేశంను ఆదివారం జిల్లా అధ్యక్షులు గొట్టాపు శ్రీరామమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎపిజెఎసి అమరావతి రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాలో చేపట్టిన నల్ల రిబ్బన్లను ధరించడం, కార్యాలయపు పని వేళలో మాత్రమే పనిచేయుటకు (వర్క్ టు రూల్) పాటించడానికి సహకరించిన జిల్లా అధికార యంత్రాంగానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానించారు. అలాగే ప్రస్తుతన జిల్లా కార్యవర్గంలో ఏర్పడిన ఖాళీలలో ప్రస్తుత కార్యదర్శిగా వున్న వివిఎస్ శర్మ పదోన్నతి తోను, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా వున్న పి. కిరీటి వేరే జిల్లాకు బదిలీ అయిన కారణంగాను ఇతర ఖాళీలలో కార్యదర్శిగా పాలకొండ తహశీల్దార్ వి.సోమేశ్వరరావు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా పార్వతీపురం రెవిన్యూ డివిజినల్ కార్యాలయంలోని జూనియర్ సహాయకులు బి. శివరామకృష్ణను, పార్వతీపురం ఉపాధ్యక్షులుగా ఎల్విన్ పేట ప్రత్యేక రెవిన్యూ పరిశీలకులు, గిరిజన సంక్షేమ ఉప కలెక్టరు కార్యాలయం రెవెన్యూ పరిశీలకులు ఎన్. శ్రీనుబాబును, కార్యవర్గ సభ్యులుగా బలిజిపేట రీ-సర్వే ఉప తహశీల్దార్ పి.రమేష్ నాయుడు, పాచిపెంట రెవిన్యూ పరిశీలకులు పి.రామచంద్ర రావులతో భర్తీ చేయుటకు ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మానించారు. ఈసమావేశంలో పార్వతీపురం తహశీల్దార్, జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. శివన్నారాయణ, సీతంపేట, కొమరాడ, తహశీల్దార్లు ఎస్. నరసింహమూర్తి, సిహెచ్ రాధాకృష్ణమూర్తి, తహసిల్దార్లు, కోశాధికారి పిఎఎల్ కుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలి వెళ్ళిన ప్రజా సంఘాలు

విశాలాంధ్ర - పార్వతీపురం : ఈ నెల 5న పార్లమెంట్ వద్ద జరుగు చలో ఢిల్లీ కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లా నుండి రైతు సంఘం, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలు దేరి వెళ్ళారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని ఆరోపించారు. ఢిల్లీలో రైతులు, కార్పొరేటు అనుకూల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసినప్పుడు చట్టాలను రద్దుచేస్తామని కేంద్రప్రభుత్వం హామీ ఇచ్చిన సంవత్సరం గడిచిన చట్టాలను రద్దు చేయలేదన్నారు. రైతుల పంటకు గిట్టుబాటు ధరలుచట్టం అమలు చేయలేదని, రైతులు వినియోగించే విద్యుత్తుకు పంపుసెట్లకు మీటర్లు బిగించి విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకులను, ఎల్ఐసి, పోస్టల్ రైల్వే రవాణా, విమానయానం ,మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేట్ వ్యక్తులు చేతుల్లో పెడుతుందన్నారు. కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న దేశ రాజధాని ఢిల్లీలో జరుగు కార్యక్రమానికి జిల్లా నుండి వెళుతున్న రైతులకు, కార్మికులు మరియు కార్యకర్తలకు పలువురు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, ఆర్.ఈశ్వరరావు అప్పారావు, నారాయణస్వామి, సీహెచ్, కృష్ణ, గుంపస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ, ఉద్యోగ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తా

పట్టభద్రుల ఎమ్మెల్సీ చిరంజీవిరావు

విశాలాంధ్ర - పార్వతీపురం : నిరుద్యోగ, ఉపాధ్యాయ, అధ్యాపక, ఉద్యోగ వర్గాల సమస్యల పరిష్కారంనకు ప్రాధాన్యతనిచ్చి, వాటిపరిష్కారం కొరకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టరు వేపాడ చిరంజీవిరావు (ఎకానమీ చిరంజీవి) అన్నారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణరావు అధ్యక్షతన పార్వతీపురం రాయల్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్లో జరిగిన ఏపిటిఎఫ్ ఆత్మీయ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడారు. సమావేశంలో పాల్గొన్న ఏపీటిఎఫ్ కార్యకర్తలు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. చిరంజీవిరావు మాట్లాడుతూ తనగెలుపుకు సహకరించిన ఉత్తరాంధ్ర ఏపీటిఎఫ్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలియజేశారు మునిసిపల్ ఉద్యోగులకు పిఎఫ్ నంబర్లు కేటాయించుట, కేజీబీవీ, ఏపీ గిరిజన సంక్షేమం గురుకులాల సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ మంజూరు చేయుట, ఏపీ ఆదర్శ పాఠశాలల సిబ్బందిని రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖలో విలీనంచేయుట మరియు వారికి కారుణ్య నియామకాల సౌకర్యంకల్పించుట తదితర సమస్యల పరిష్కారంకొరకు తనశక్తి మేరకు, పరిధి మేరకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో ఏపీటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు (వేణు),ఉమ్మడి విజయనగరం జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, ప్రత్యేక ఆహ్వానితులు మర్రాపు మహేష్, జిల్లా సబ్ కమిటీ, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ని భర్తరఫ్ చెయ్యాలి

లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి

విశాలాంధ్ర - విజయనగరం క్రైమ్ : గత 55 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా రెండు రాష్ట్రాల వివాదాస్పద సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న కొఠియా గ్రామాల పరిధిలో పర్యటించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విజ్ఞత కోల్పోయినట్టు ప్రవర్తించారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ వెంటనే ధర్మేంద్ర ప్రధాన్ ను మంత్రి పదవి నుండి తొలగించాలని లోక్ సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి డిమాండ్ చేశారు. ఆదివారం విజయనగరం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ సమగ్రత,ప్రజల మధ్య శాంతి, సౌభాగ్యాలు కోసం పని చేస్తానని ప్రమాణం చేసి మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వ్యక్తి ఆంధ్రప్రదేశ్ కి చెందిన పంచాయతీ వగులు, చెన్నూరులో పర్యటించి ఆంధ్రప్రదేశ్ పోలీసులను అవమానిస్తూ స్వయంగా కేంద్రమంత్రే ఆంధ్ర గో బ్యాక్ అంటూ ఎలా నినాదాలు ఇస్తారని ప్రశ్నించారు. చట్టంపై,రాజ్యాంగంపై గౌరవం లేని వ్యక్తికి కేంద్ర మంత్రిగా ఉండే అర్హత లేదని, రెండు రాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయనే సుప్రీంకోర్టు తీర్పుని కాదని మాట్లాడిన మంత్రి పై సుప్రీంకోర్టు తగిన చర్యలు తీసుకోవాలని భీశెట్టి డిమాండ్ చేశారు. త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రధాన మంత్రికి రాష్ట్ర పతికి,రాష్ట్ర గవర్నర్కి వివరాలతో లేఖలు రాస్తామని, కొఠియా గిరిజన ప్రాంతాల్లో త్వరలోనే పర్యటిస్తామని భీశెట్టి తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు శిమ్మ శ్రీను,భాస్కర్, ఎర్నిబాబు పాల్గొన్నారు.

భర్త ఆత్మహత్యా యత్నం

విశాలాంధ్ర - బెలగాం : తాగి వస్తున్నందుకు భార్య తిడుతుందని భర్త ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి జరిగింది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సీతానగరం మండలం బక్కుపేట గ్రామానికి చెందిన బక్కు శ్రీనివాసరావు తాపీమేస్త్రీగా, ట్రాక్టర్ డ్రైవరుగా పని చేస్తున్నాడు. తన భార్య బక్కు చింతల్లికి కూలి డబ్బులు ఇచ్చిన రోజున సరదాగా వుంటూ తనను గౌరవిస్తుంది, డబ్బులు ఇవ్వని రోజున తిడుతుంది. శ్రీనివాసరావుకు తాగుడు అలవాటు ఉంది. తాగి వస్తున్నాడని తనను రోజు తిడుతుంది. తాగి ఇంటికి డబ్బులు ఇవ్వడం లేదని తిడుతున్నందువలన మనస్తాపం చెంది చనిపోవాలనే ఉద్దేశ్యంతో శనివారం రాత్రి ఇంట్లో వ్యవసాయంకు వాడగా మిగిలిన గడ్డిమందుని తాగగా నోటి వెంట వచ్చిన వాసనను పసిగట్టిన అతని భార్య వీధిలో వాళ్ళకు చెప్పగా వారు 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఔట్ పోస్టు పోలీసులు వివరాలు

ఆర్‌బికే ఛానల్‌తో ఎన్నో ప్రయోజనాలు

విశాలాంధ్ర - పాచిపెంట : రైతులకు ఆధునిక వ్యవసాయంలో సాంకేతిక విజ్ఞానాన్ని అందించడం కోసమే ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిందని విత్తనం నుండి విత్తనం వరకు కావలసిన పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచుతుందని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు శనివారం నాడు నాందేడ్ వలస రాయి గుడ్డి వలస రైతు భరోసా కేంద్రాలను సందర్శించి అందుబాటులో ఉన్న రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలలో ఒక దృశ్య శ్రవణ(టీవీ) యంత్రాన్ని ఏర్పాటు చేసిందని అలాగే వివిధ రకాల సేవలు కోసం ఒక కియోస్క్ ను ఏర్పాటు చేసిందని మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులకు సాంకేతిక సాగు సలహాలు అందించటం కోసం ఒక డిజిటల్ లైబ్రరీని అందుబాటులోకి తేవడంతో పాటుగా తీరిక వేళల్లో చదువుకోవడం కోసం లైబ్రరీని ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏలు అనిల్ మరియు సాయికిరణ్ పాల్గొన్నారు.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

విశాలాంధ్ర - బెలగాం : బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలు, ఎపికి ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్ ఇవ్వకుండా, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, రాష్ట్రానికి ద్రోహం చేసే విదానంపై సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారం ఈ నెల 14వ తేదీ నుండి 30వ తేదీ వరకు గ్రామ గ్రామాన సభలు, సమావేశాలు జరపాలని ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు మాట్లాడుతూ మోడి నిరంకుశ చర్యలను ఖండించాలని కోరారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి. జీవన్న, జిల్లా నాయకులు ఈవి నాయుడు మాట్లాడుతూ రాష్ట్రానికి నష్టం చేసే చర్యలకి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.అవినాష్, జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

నేటి నుండి 10వ తరగతి పరీక్షలు

విశాలాంధ్ర - వేపాడ : నేడు అనగా సోమ వారం నుంచి 10వ పబ్లిక్ పరీక్షలు నిర్వహించడం జరుగు తుందని మండల విద్యాశాఖ అధికారిని శ్రీదేవి అన్నారు. బుధవారం నుంచి నిర్వహించబోయే ఈ పరీక్షలు మండల కేంద్రం వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,విక్టరీ పాఠశాల,కే.జీ పూడి గిరిజన ఆశ్రమ పాఠశాల కేంద్రాలుగా నిర్వహించడం జరుగు తుందన్నారు. మూడు కేంద్రాలలో 385మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాస్తారన్నారు. వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కేంద్రంగా 192 మంది విద్యార్థులు, విక్టరీ పాఠశాల కేంద్రంగా 192 మంది విద్యార్థులు,కే.జీ పూడి గిరిజన ఆశ్రమ పాఠశాల కేంద్రంగా120 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ముఖ్యంగా పరీక్షలు రాసేందుకు వచ్చే విద్యార్థుల రవాణాకు ప్రభుత్వం ప్రత్యేక బస్సు సౌకర్యాలను సమకూర్చినట్లు ఈ మేరకు రోడ్డు రవాణా శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది అన్నారు. ఇందుకు సంబంధించి కేంద్రాలలో విద్యుత్, త్రాగు నీరు, బెంచీలు, మరుగు దొడ్లు తదితర సౌకర్యాలను సమకూర్చినట్లు ఆమె తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మట్టలాదివారం

విశాలాంధ్ర - బొబ్బిలి : స్థానిక మహారాణి పేట సెయింట్ ఆంధ్రూస్ లూథరన్ చర్చ్ నందు మట్టాలాదివారం వేడుకను పాస్టర్ కె శ్యాం కుమార్ అధ్యక్షతన చర్చ్ డెలిగేట్ జెసి.రాజు ఆధ్వ ర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చ్‌లో ఆరాధనలు నిర్వహించారు. పాస్టర్ శ్యాం కుమార్ ఉపదేశిస్తూ క్రీస్తు ప్రభువు సిలువ మరణం పొందేందుకు ముందుగా యెరూషలేము మహా నగర ప్రవేశమే మట్టాలాదివారం గా క్రైస్తవులు నిర్వహిస్తారని అన్నారు. విజయ సూచకంగా పూలతో అలంకరించిన మట్టలను ప్రదర్శిస్తూ లోక రక్షకుడైన క్రీస్తు ప్రభువుకు జయము జయము అంటూ ప్రార్థించారు. గుడ్ ఫ్రైడే కి ముందు వచ్చే ఆదివారాన్ని మట్టాలాదివారం లేక విజయోత్సవ ఆదివారం అంటారన్నారు. ఈ ఆదివారం తరువాత క్రీస్తు పరిశుద్ధ వారం ప్రారంభమై గుడ్ ఫ్రైడే తో ముగుస్తున్నదని తెలియచేసారు. క్రైస్తవ విశ్వాసులూ భక్తి శ్రద్ధలతో క్రీస్తు పరిశుద్ధవారాన్ని ఆచరించాలని కోరారు. కార్యక్రమం లో క్రైస్తవ విశ్వాసులతో పాటు స్నేహ రత్నం, మెర్సీ పసుపులేటి శేఖర్, డివి.జ్యోతుల, కిషోర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సాంబారు టబ్బులో పడ్డ బాలుడు

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్.కోట మం డలం, కిల్తంపాలెం పంచా యతీ శివారు గవరపాలెం గ్రామంలో శ్రీరామనవమి రోజున అన్న సమారాధన నిర్వహిస్తుండగా పెంటకోట శశికుమార్ అనే అయిదేళ్ల బాలుడు అన్నం తింటూ వేడి సాంబారు టబ్బుపై కూర్చుని అనుకోకుండా పడిపోయాడు. దీంతో తీవ్రంగా కాలిన గాయాలకు గురయ్యాడు. వెంటనే స్థానికులు బాలుడిని విజయనగరంలోని సర్వజన ఆసుపత్రికి తరలించారు. అయితే బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి విశాఖ కేజిహెచ్ కి తరలించారు. ఈ మేరకు కేజిహెచ్ వైద్యులు బాలుడు శశికుమార్‌కి మెరుగైన వైద్యం అందించటంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడని, ప్రస్తుతం కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు, ఎన్.ఐ తారకేశ్వరరావు ఆదివారం తెలిపారు.ఎంతో చురుకుగా ఉండే శశికుమార్‌కు ప్రాణాపాయం లేదని తెలియడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అపారిశుద్ధ్యంలో వావిలపాడు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వావిలపాడు గ్రామంలో కాలువలు వీధులలో అపరిశుద్ధ్యంతో పేరుకుపోయి దోమల బెడద ఎక్కువ కావడంతో గ్రామ ప్రజలు అనేకమంది అనారోగ్యం పాలవు తున్నారు. గ్రామంలోని రాజవీధితో సహా అన్ని వీదుల్లోని కాలువలన్నీ మురికినీటితో నిండిపోవడంతో దోమలు విపరీతంగా ఆవహించి ప్రజలు దోమ కాట్లకు గురై అనారోగ్యం నకు గురవుతున్నారు. దాంతో గ్రామంలో జ్వరపీడితుల సంఖ్య గణనీయంగా పెరిగి ఆస్పత్రుల పాలవుతున్నారు. దోమ కాట్లకు గురికావడం వల్ల వివిధ రకాల రోగాలు పీడిస్తున్నాయని గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఒక పక్క వర్షాలు పడడం మరో పక్క పంచాయతీ పాలకులు మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్త చెదారం సరిగా తొలగించక పోవడం వల్ల దోమలు విపరీతంగా ముసిరి ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. చెత్త చెదారం తొలగించకపోవడం వల్ల మురికినీరు సీసీ రోడ్ల పైకి పొంగి ప్రవహించడం వల్ల దుర్గంధం వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగితే .. రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది

జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విశాలాంధ్ర - వేపాడ : రాష్ట్రంలో మహిళలు ఆర్థికంగా ఎదిగినాడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తద్వారా నాడు పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మహిళలకు వైయస్సార్ ఆసరా పథకం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు వైయస్సార్ ఆసరా పథకం 3వ విడత ఆర్థిక సహాయం నిధులు అందించడం జరుగుతుందని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) అన్నారు.మండల కేంద్రమైన వేపాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వై.ఎస్.ఆర్ ఆసరా 3వ విడత ఆర్థిక సహాయం నిధుల విడుదల కార్యక్రమం శృంగవరపుకోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ప్రసంగించారు.ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం చెప్పిన సమయం ప్రకారం అక్కా చెల్లెమ్మల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వైయస్సార్ ఆసరా మూడో విడత నిధులు విడుదల చేయడం జరిగిందన్నారు. జగనన్న ఆసరా పథకానికి అర్హులైన మహిళలకు గత రెండేళ్లలో రాష్ట్రంలో రూ.19 వేల 172 కోట్లు పంపిణి చేయగా, 3వ విడతలో రూ.6, వేల 412 కోట్ల పంపిణి చేసారని,తెలిపారు.అలాగే వేపాడ మండలంలో గల మొత్తం 1020 స్వయం సహాయక సంఘాలలోని 11,346 మంది అక్కా చెల్లెమ్మలకు రూ.13.25కోట్లను ఇది వరకే రెండు పర్యాయాలు జమ చేయడమైందని, ఇప్పుడు 3వ విడతగా రూ.6.63 కోట్లలను అక్కా చెల్లెమ్మల ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. కరోనా మహమ్మారి వల్ల 2 సంవత్సరాలు రాష్ట్రం ఆర్థిక పరిస్థితి అల్లకల్లోలంగా ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ ప్రతి ఏడాది అక్కచెల్లెమ్మల ఖాతాలలో జమ చేయడం జరిగిందని అన్నారు. కాగా జగనన్నకు అక్కా చెల్లెమ్మలైన మీద ఉన్నటువంటి అమితమైన ప్రేమ వల్లనే చేస్తున్నారన్నారు. మహిళలు ఎందులోనూ తీసిపోకూడదని వారు ఆర్థికంగా సామాజికంగా ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే జగనన్న లక్ష్యమన్నారు. కాబట్టి సీఎం జగన్ కి మీ అండదండలు ఉండాలని రాబోయే 2024 ఎన్నికల్లో మీ యొక్క అభిమానాన్ని సీఎం జగన్కి అందించాలని కోరారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజులు మాట్లాడుతూ రాష్ట్రంలో దొంగల పార్టీ అయినా ప్రతిపక్ష టీడీపీ గ్రామాల్లో తిరిగి అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలో రావాలని చూస్తున్నారని వారి మాటలను నమ్మే మోసపోవద్దని నాడు మహిళలకు నారా చంద్రబాబునాయుడు మోసపూరిత మాటలను చెప్పి మహిళలకు ఆర్థికంగా నష్టపరిచారని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు డి సి సి బి చైర్మన్ వేచలపు వెంకట చిన రామునాయుడు, శ్రీకాకుళం - పార్వతీపురం మన్యం - అల్లూరి సీతారామరాజు జిల్లాల పార్టీ పంచాయితీరాజ్ వింగ్ జోనల్ ఇంఛార్జి మెరపుల సత్యనారాయణ, ఏ.ఎమ్.సి చైర్మన్ మూకల కస్తూరి, ఎం.పి.పి. దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటిసి శానాపతి అప్పారావు, వైస్ ఎం.పి.పి దాయరి ముత్యాలమ్మ , మండల పార్టీ అధ్యక్షులు శ్రీ మమ్ములూరి జగన్నాథం, సర్పంచుల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జె.సి.ఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, వైసిపి నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎం.పి.టి.సిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు, స్వయం సహాయక సంఘాలకు చెందిన లబ్ధిదారులు పాల్గొన్నారు.

రియల్ ఎస్టేట్ రంగంలో ఎస్వీఎన్ శ్రీనివాసా సుజాత గ్రూప్ నూతన ఒరవడి

విశాలాంధ్ర- గంట్యాడ/ విజయనగరం టౌన్ : రియల్ ఎస్టేట్ రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టిన ఎస్వీఎన్ శ్రీనివాసా సుజాత గ్రూప్ ఎంతైనా అభినందనీయులని. రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, గజపతినగరం నియోజకవర్గ శాసన సభ్యులు బొత్స అప్పల నరసయ్య, నెల్లిమర్ల నియోజకవర్గ శాసన సభ్యులు బద్దు కొండ అప్పలనాయుడు, శృంగవరపుకోట నియోజకవర్గ శాసనసభ్యులు కడుబండి శ్రీనివాసరావు, శాసన మండల సభ్యులు డాక్టర్ పి. వి.వి సూర్యనారాయణ రాజు, అరకు పార్లమెంటు నియోజకవర్గం ఇంచార్జ్ శత్రుచర్ల పరీక్షిత్ రాజు, రాష్ట్ర మారిటోరియం చైర్మన్ కాయల వెంకటరెడ్డిలు కొనియాడారు. ఆదివారం నాడు ఎస్ కోట నియోజకవర్గం పరిధిలో తాటిపూడి రిజర్వాయర్ సమీపంలో 160 ఎకరాల సువిశాల ప్రాంతంలో ఎస్‌వీఎన్ శ్రీనివాస సుజాత గ్రూప్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ వీఎన్ స్వప్నలోక్ రియల్ ఎస్టేట్ నూతన వెంచర్ ప్రారంభ వేడుకలలో వీరు అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ముందుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథులు చేతిలో మీదుగా ఎస్ వి ఎన్ స్వప్నలోక్ రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుకు సంబంధించిన బ్రోచర్లను విడుదల చేశారు. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సంస్థకు సంబంధించిన కార్పొరేట్ వెబ్సైట్ను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిపాలనా రాజధానిగా విశాఖపట్నం వస్తున్న త, మరోపక్క భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభమవుతుంద నేపథ్యంలో అరకు, అనంతగిరి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్న సమయంలో తాటిపూడి ప్రాంతంలో నూతన వెంచర్ ఏర్పాటు చేయడం సంస్థ నిర్వాహకులు ఎంతైనా అభినందనీయులని అన్నారు . సుమారు 160 ఎకరాలలో అందర్నీ ఆహ్లాదపరిచే రీతిలో, ప్రకృతి ఒడిలో అందమైన వెంచర్ ఏర్పాటు చేసి , అందరికీ ఆమోదయోగ్యమైన ధరలో, అన్ని రకాల వసతులతో వెంచర్ను ఏర్పాటు చేయడం సాహసోపేత నిర్ణయమని అన్నారు. జిల్లాలోని కనివిని ఎరుగని రీతిలో అన్ని వసతులు ఏర్పాటు చేస్తూ, ప్రకృతి కనుమల మధ్య మంచి లేఅవుట్ ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు.ఈ ఎస్వీఎన్ గ్రూపు అనగానే ప్రజలలో మంచి అభిప్రాయం ఉందని, ప్రజలలో ఉన్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిర్వాహకులు సాహసోపేతంగా అన్ని రకాల వసతులు ఒకచోటే కల్పించే విధంగా వెంచర్ను ఏర్పాటు చేసి, ప్రజల అభిమానాన్ని పొందాలని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కూడా పర్యాటక రంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగానే ఈ నూతన వెంచర్ పక్కనే సుమారు 1200 ఎకరాలలో జిందాల్ పరిశ్రమ రాబోతుందని తెలిపారు. అలాగే బొడ్డవర నుంచి రాయపూర్ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా రాబోతోందని అన్నారు. అరకు ,అనంతగిరిని టూరిజం హబ్ గా ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్న ఈ వెంచర్ లో పెట్టుబడులు పెడితే మంచి లాభాలు వస్తాయనే ధీమాను వ్యక్తం చేశారు. సంస్థ చైర్మన్ జి శ్రీనివాసరావు మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల ఆశీస్సులతో ఎస్వీఎన్ గ్రూపు ఏర్పాటు చేసి ఆప్టికల్ రంగంలోనూ, ఫోటో రంగంలోనూ ప్రజల అభిమానాన్ని చురగున్నామని, అదే స్ఫూర్తితో ఎస్వీఎన్ నగర్ వెంచర్ను ఏర్పాటు చేసి విజయం సాధించామని, సమాజానికి భక్తి భావాన్ని కూడా అందించాలని ఉద్దేశంతో జ్ఞాన సరస్వతి ఆలయాన్ని, పశుపతి నాథేశ్వర ఆలయాన్ని కూడా నిర్మించి అభిమానాన్ని పొందామని అన్నారు. ప్రస్తుత ఆధునిక , సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని తమ కుమారులు కార్తీక్, ఈశ్వర్ కౌశికుల ఉత్సాహంతో ఎస్వీఎన్ స్వప్నలోక్ ప్రాజెక్టును ప్రారంభించడం జరిగిందని అన్నారు. సంస్థ డైరెక్టర్ లు కార్తీక్, ఈశ్వర్ కౌశికులు మాట్లాడుతూ పెట్టుబడిదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలు ఫలించే విధంగా ఎస్వీఎన్ స్వప్నలోక్ అందంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నె క్కల నాయుడు బాబు, డీసీసీబీ చైర్మన్ వెంకట చిన్న రామనాయుడు, నగర మేయర్ శ్రీమతి వెంపడా పు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి,ఇసరాపు రేవతి దేవి, మాజీ శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులు నాయుడు, సంస్థ ప్రతినిధులు, వ్యాపారులు, ఖాతాదారులు , ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల్లో యువత రాణించాలి

విశాలాంధ్ర - కురుపాం : యువత విద్య తోపాటు క్రీడల్లో రాణించాలని ఎల్విన్ పేట ఎస్ ఐ షణ్ముఖ రావు యువత కు సూచించారు. మండలంలోని పెద గొత్తిలి పంచాయితీ పెదబారామని లో ఆదివారం నుండి జరిగే మండల స్థాయి క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి, దేహదారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు సర్పంచ్ టి. లోకనాథం మరియు యువత మాట్లాడుతూ మొత్తం 40 టీములు పాల్గొంటాయని మొదట బహుమతి రూ.20,000, ద్వితీయ బహుమతి రూ.10,000 తృతీయ బహుమతి రూ. 5000 నగదును అందజేయడం జరుగుతుందని ఆసక్తి గల టీములు టోర్నీలో పాల్గొనవచ్చని అన్నారు. అలాగే 18 సంవత్సరాలు వయసు నిండిన వారికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్ ఇచ్చే స్లాట్‌ను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ రైట్స్ పోరం రాష్ట్ర అధ్యక్షులు అర్.లావరాజు ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఐ.రామకృష్ణ, మొండెంఖల్ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు టి.నాగభూషణరావు పాల్గొన్నారు.

విశాఖ ఎంపీ కబ్జాపై ఇక ఉద్యమమే

సీబీఎన్‌సి ఆస్తుల పరిరక్షణ కమిటీ వెల్లడి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : విశాఖపట్నంలో సిబిఎన్‌సి ఆస్తులను విశాఖ ఎంపి, డవలపర్ ఎంవివి సత్య నారాయణ యధేచ్ఛగా దురాక్రమణల పై సిబిఎన్‌సి ఆస్తుల పరిరక్షణ కమిటీ ఇక ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కన్వీనర్ ఆర్ఎస్ జాన్ మాట్లాడుతూ సిబిసిఎన్‌సి ఆస్తులు కొనుగోలు చేసి ఎవరూ మోసపోవద్దని సూచించారు. ఈ మేరకు ఆదివారం అన్ని చర్చిలలో భగవంతుడు మంచి మనస్సు ఇవ్వాలంటూ ప్రత్యేక ప్రార్థనలు చేయడం జరిగిందన్నారు. తదుపరి ఆదివారం అన్ని చర్చిలలో నిరసన దీక్ష లు , ప్రజా ప్రతినిధులు,అధికారులకు వినతి పత్రాలు అంద జేస్తామన్నరు. ఛలో విశాఖ కార్యక్రమం అన్ని క్రైస్తవ సంఘాలతో కలిసి చేపడతామన్నారు. ముఖ్య మంత్రి కి లేఖ రాస్తామని అప్పటికి స్పందించ క పోతే విజయవాడ ధర్నా చౌక్ లో పెద్ద ఎత్తున ఆందోళన క్రయక్రమం చేపడతామన్నారు. ఇదిలా వుండగా సంబంధించిన ఆస్తుల వివరాలు, కోర్టు ఇచ్చి ఆదేశాలను అందించారు. 1874 నుంచి సిబిఎం ఆవిర్భవించిందని, తదుపరి అనేక ఆస్తులను కాపాడుకుంటూ సేవలు చేసిందన్నారు. 1975లో మద్రాస్ కోర్టు సి.బి.సి.ఎన్.సి ట్రస్ట్ అసోసియేషన్‌కు ఆస్తులను బదలాయించిందని తెలిపారు. 2009లో విశాఖ లాంటి ప్రాంతంలో డిక్రి నందు టైటిల్ రైట్ ఎవరికి దఖలు పర్చలేదని 2017లో హైకోర్టు కూడా స్టేటస్‌కో ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఐనా హిల్‌క్రస్ట్ బంగ్లా ఆధీనంలో ఉన్న ఆస్తులు కొందరు కొనుగోలు చేయడం, 15వేల, 376.9 చదరపు గజాల స్థలం రెగ్యులైజ్ చేసి, దానిని ఆక్రమించడం ఇప్పుడు ఎం.పి సత్యనారాయణ వంతు అయిందని ఆరోపించారు. కోట్లాది రూపాయల విలువగల ఆ ఆస్తులను పరిరక్షించాలని కోరారు. వెంటనే జీవిఎంసి కమీషనర్ తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సి.బి.ఎన్.సి ఆస్తుల అన్నింటిపైనా స్టేటస్‌కో ఉందని వాటిని ఏవర్గం కానీ, హక్కులు పొందలేరని స్పష్టం చేశారు. ముందు అన్ని బాప్టిస్ట్ సంఘాల నాయకులు తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విశాఖ వెస్లీ, సుధాకర్, శ్రీకాకుళం జాన్ డేవిడ్, సి.బి.ఎన్.సి పరిరక్షణ కమిటీ సభ్యులు టి.ఆనందరావు, కుప్పు, సుకుమార్, మధుసూదన్, ఎం.ఏ.నాయుడు, జె.డానీ, ఈస్ట్ గోదావరి అకు మర్తి శామ్యూల్, ఎం.ఆగస్ట న్, వేస్ట్ గోదావరీ జోషప్ రాజు, కృష్ణా దీపక్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలి

విశాలాంధ్ర - చీపురుపల్లి : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమములో భాగంగా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకు రాష్ట్ర విద్యాశాఖా మాత్యులు, పెద్దలు, స్థానిక శాసనసభ్యులు శ్రీ బొత్స సత్యనారాయణ గారు, విజయనగరం జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్షులు శ్రీమజ్జి శ్రీనివాసరావు, విజయనగరం పార్లమెంట్ సభ్యులు శ్రీ బెల్లాన చంద్రశేఖర్(పెదబాబు) ఆదేశాలు మేరకు వై.యస్.ఆర్. పార్టీ అధ్యక్షులు శ్రీ మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) గారి పర్యవేక్షణలో ఈ రోజు చీపురుపల్లి పట్టణంలో సచివాలయం 1, 2, 3, 4, 5 పరిధిలో సచివా లయం కన్వీనర్లు, వాలంటీర్లు మరియు గృహ సారధులతో సమావేశం నిర్వహించి ప్రచారసామాగ్రిని పంపిణీ చేసిన చీపురుపల్లి మండల సీనియర్ నాయకులు ఎంపీపీ ఇప్పిలి అనంతం, చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు జడ్పీటీసీ వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, మండల కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు , వాలంటీర్లు, గృహసారదులు స్థానిక సర్పంచ్ మరియు ఎంపీటీసీ ఇతర పార్టీ నాయకులతో కలిసి ఈనెల ఏప్రిల్ 7వ తేదీ నుంచి సచివాలయాల పరిధిలో ఇంటి ఇంటికి జగనన్నే మా భవిష్యత్తు ప్రచార కార్యక్రమంను ప్రతి ఇంటి వద్ద సుమారు 15 నుండి 20 నిమిషాలు పాటు గడపాలి, ప్రచార సందేశాన్ని వివరించి వారి మద్దతు కోరాలన్నారు, గత ప్రభుత్వం కంటే మన ప్రభుత్వ పాలనలో ప్రజలకు మరింత మంచిజరుగుతుంది అనే కరపత్రాన్ని చదివి, దానిని ఇంటి వారికి అందజేయాలన్నారు. ప్రజా మద్దతు పుస్తకాలలో ఉన్న ప్రశ్నలను ఇంటి వారిని అడిగి సమాధానాలను పూరించి ఆ ఇంట్లో వారికి రసీదు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి మండల సీనియర్ నాయకులు ఇప్పిలి అనంతం , చీపురుపల్లి మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, గ్రామ సర్పంచ్ మంగళగిరి సుధారాణి శ్రీనివాస్, యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, మండల కన్వీనర్ సువ్వాడ అప్పలనాయుడు, శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద్, గెరిడీ రామదాసు, కోరుకొండ దాలయ్య, కోసిరెడ్డి రమణ, ముళ్ళు పైడిరాజు, 20 వార్డు మెంబర్లు, కర్రోతు రమణ, పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు ఇతర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.